క్లుప్తంగా

అభివృద్ధి పనులపై ఆరా



అభివృద్ధి పనుల గూర్చి అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: స్థానిక 17వ డివిజన్‌లోని గాంధీ పార్కును రూ.40.48 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. గాంధీ పార్కును ఆయన గురువారం సందర్శించి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.6.06 లక్షలతో మరుగుదొడ్లు, రూ.6.02 లక్షలతో ప్రహరీ, పిల్లల క్రీడాసామగ్రి, రూ.28.40 లక్షల సాధారణ నిధులతో ఓపెన్ ఆడిటోరియం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

మార్మోగిన శివనామస్మరణ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న ఉమా సదాశివాలయంలో శివనామస్మరణ మార్మోగింది. గురువారం మాస శివరాత్రి పురస్కరించుకుని, ఆలయ ప్రధానార్చకుడు రేజేటి మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ పండ్ల రసాలు, నదీజలాలతో అభిషేకం చేశారు. అనంతరం హోమం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గుణుపూరుపేటలో అలుగు పట్టివేత



గుణుపూరుపేటలో పట్టుబడిన అలుగు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేటలో ఓ అలుగును స్థానికులు పట్టుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. గ్రామంలో ఓ చోట తిరుగాడుతున్న అలుగును గ్రామస్తులు చూసి, అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న సిబ్బంది ఆ అలుగును స్వాధీనం చేసుకున్నారు.

డ్రోన్లతో నిఘా



డ్రోన్ ఎగురవేసి తనిఖీలు చేపడుతున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: పట్టణంలో పలు ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలను గుర్తించేందుకు పోలీసులు డ్రోన్లతో నిఘా పెడుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సహా పూడమ్మ వనంగుడి పరిసరాలు, డైట్ కళాశాల రహదారి ప్రాంతాల వైపు గురువారం డ్రోన్లు ఎగురవేసి తనిఖీలు చేశారు. బహిరంగంగా మద్యం సేవించే వారిని, గంజాయి వినియోగిస్తున్న వారిని, పేకాట ఆడుతున్న వారిని గుర్తించే పని చేపట్టినట్లు ఎస్‌ఐ గణేష్ తెలిపారు. ఇదే నిఘా నిత్యం ఉంటుందని తెలిపారు.

వినతిపత్రం అందజేత



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భోగాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు స్థానిక పట్టణంలోని గాంధీ విగ్రహానికి గురువారం వినతిపత్రం అందజేసి, వినూత్నంగా నిరసన చేపట్టారు. వేతనాలు పెంచాలని, ఫేస్‌యాప్ హాజరు రద్దు చేయాలని, 5జీ నెట్‌వర్క్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రవీణ, నరసమ్మ, ఉష, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

24న సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో సాహితీ సదస్సు ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. కౌముదీ పరిషత్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కరుణశ్రీ కవితా వైభవం అనే అంశంపై విశాఖపట్నానికి చెందిన రాళ్లపల్లి విద్యాసాగర్ ప్రసంగించనున్నారన్నారు. సాహితీవేత్తలంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అన్ని ధ్రువపత్రాలు ఉంటేనే..

- ఇకనుంచి రిజిస్ట్రేషన్లు, ఆటోమ్యుటేషన్లకు కొత్త విధానం
- తొలుత కార్పొరేషన్, తదుపరి మున్సిపాలిటీల్లో అమలు
- ప్రస్తుతం విజయనగరంలో అమల్లోకి నూతన విధానం



విజయనగరం వ్యూ

విజయనగరం: రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణల పేరిట కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలులోకి తీసుకువస్తున్నారు. తొలుత వీటిని కార్పొరేషన్ పరిధిలో అమలు చేసి తర్వాత మున్సిపాలిటీల్లో అమలు చేయనున్నారు. ఈ విధానం ఇప్పటికే విజయనగరంలో అమల్లోకి వచ్చింది. ఇక పన్ను బకాయిలు ఉంటే ఆస్తులు రిజిస్ట్రేషన్ కావు. ఆ బకాయిల లేవని తగిన ఆధారాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతారు.

నగరంలో ఖాళీ స్థలం, ఇల్లు కొనుగోలు చేసుకున్న వారు ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటివరకు సచివాలయం ద్వారా రిజిస్టర్ దస్తావేజు ఆన్‌లైన్‌లో పంపితే అధికారులు పరిశీలించి టైటిల్ మార్పు చేసి పన్ను విధిస్తున్నారు. ఇక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా చేరుతాయి. అక్కడ పరిశీలించి ఆమోదం పొందగానే ఆటోమ్యుటేషన్ పత్రం జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియ ముగిశాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త దస్తావేజు ఇస్తారు. మార్కెట్ విలువ, స్థలం, విస్తీర్ణం బట్టి మ్యుటేషన్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించారు.

పన్నుల రసీదు తప్పనిసరి..

రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటికి చెల్లిస్తున్న ఆస్తి, నీళ్ల పన్నుల రసీదు సమర్పించాలి. స్థలమైతే వీఎల్టీ(వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) రసీదు అందజేయాలి. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమేటిక్‌గా కార్పొరేషన్ రికార్డుల్లో పేరు మారుతుంది. అవి లేని పక్షంలో పన్ను వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కార్పొరేషన్ లాగిన్‌కు సమాచారం వస్తుంది. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తించనుంది.

వాట్సాప్‌కు రిజిస్ట్రేషన్ పత్రాలు..

ఇక నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న కొనుగోలుదారుడికి తక్షణమే రిజిస్ట్రేషన్ పత్రాలు వాట్సప్ ద్వారా రానున్నాయి. తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ దస్తావేజులు తీసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత డ్యాకుమెంట్లను స్కానింగ్ చేస్తారు. తర్వాత కొనుగోలుదారుడికి ఇచ్చిన మొబైల్ నంబర్ ఆధారంగా వాట్సాప్‌కు సంబంధిత డాక్యుమెంట్లు పెట్టనున్నారు. కొత్తగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారని, వీటిపై అధికారులకు అవగాహన కల్పించామని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 19వ డివిజన్, లంకాపట్నంలో గురువారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు మోసపూరిత పాలనను ప్రజలకు వివరించారు. ఎన్నికలకు ముందు అధికారమే లక్ష్యంగా లేనిపోని హామీలను ప్రజలకు ఇచ్చి, ఇప్పుడు వాటిని అమలు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారని తెలిపారు. గద్దెనెక్కి 14 నెలల కాలం దాటినా హామీలన్నీ అమలు చేయలేదని, కనీసం ఇచ్చిన మూడు, నాలుగు పథకాలు కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికలప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి కోసం ఇస్తానన్న 3 సెంట్ల స్థలం, అలాగే పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఇంటి కోసం ఇస్తానన్న 2 సెంట్ల స్థలం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తానన్నారని, 50 ఏళ్లు దాటిన బీసీలకు ఫించన్, నిరుద్యోగ భృతి వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. మార్గదర్శి–బంగారు కుటుంబం పేరిట పీ4 సర్వే చేసి, ఉద్యోగులకు నిరుపేద కుటుంబాలను అనుసంధానించి సదరు పథకాలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలకు ఇటీవల ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కూడా కేవలం 5 కేటగిరీల బస్సులకు మాత్రమే పరిమితం చేయడం మోసం చేయడం కాదా అని ధ్వజమెత్తారు. ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తానని చెప్పి, ఇప్పుడు ఒక్క సిలిండర్ తప్పించి ఏడాదికి మూడే ఇస్తుండడం నయవంచన కాదా అని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని, లేకుంటే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని హితవుపలికారు.

అసిస్టెంట్ కమిషనర్ క్షేత్ర పర్యటన



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: నగరంలో క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు గురువారం పర్యటించారు. 46వ డివిజన్‌కు తొలుత వెళ్లిన ఆయన అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కణపాకలో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడం లేదని, మరికొన్ని చోట్ల కాలువలు సరిగా లేనందు వల్ల మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదని వారు అసిస్టెంట్ కమిషనర్‌కు తెలిపారు. అలాగే పలు వీధుల్లో రోడ్ల మధ్యలో భవన నిర్మాణ సామగ్రి వేయడాన్ని గమనించిన ఆయన..తక్షణమే రోడ్డుపై ఉన్న ఆ సామగ్రిని తీయించి రోడ్డు మార్గం సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, కొన్నిచోట్ల ఆస్తిపన్ను పరిధిలోకి రాని భవన నిర్మాణాలను గుర్తించామని వాటిని కూడా పన్ను పరిధిలోకి తీసుకువస్తామన్నారు. అలాగే ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

విజయనగరం టౌన్: ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని నగరానికి చెందిన అన్నదాత సుఖీభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు కాంచన కోరారు. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్‌కు రక్తం అవసరం కాగా బాధిత కుటుంబ సభ్యులు సంస్థను సంప్రదించగా తనతో పాటు సంస్థ ప్రతినిధి మోహనమురళి రక్తం దానం చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా రక్తం అవసరమైతే ఫోన్ నంబర్ 7995690647ను సంప్రదించాలని, రక్తం దానం చేస్తామని ఆమె తెలిపారు.

పేద విద్యార్థులను ఆదుకోండి

చీపురుపల్లి: ప్రభుత్వం ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకీ కోరారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి మూడురోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ డి.ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకీ మాట్లాడుతూ.. విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేయాలి కోరారు. ఉపకార వేతనాలపై ఆధారపడి చదువుతున్న పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,800 కోట్ల ఉపకార వేతన బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. అలాగే పీజీలో చేరిన విద్యార్థులకు జీఓ 77ను సాకుగా చూపి ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని.. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలన్నారు. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థినులకు కాస్మొటిక్ చార్జీలను మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇవ్వాలన్నారు. విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని.. అలాంటి హక్కును కాలరాస్తూ రాజ్యాంగ విరుద్ధంగా తీసుకొచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, సభ్యులు భారతి, నాని, చీపురుపల్లి మండల కమిటీ సభ్యులు తేజ, శ్రీలత, మధులత, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

గజపతినగరం రూరల్: డిగ్రీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు చేయడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము కోరారు. నియోజకవర్గ కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 2019లో ఏర్పాటైన డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కళాశాలల్లో ల్యాబ్‌లు, గ్రంథాలయాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో శిరీష, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: మండలంలోని అక్కివరం, చింతవలస ఏపీఎస్పీ బెటాలియన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కివరం, కేవీఆర్ కంపెనీ, శ్రీనివాస హేచరీ, శ్రీశాంతి లేవుట్ ప్రాంతాలు సహా బొడ్డవలస, వెలంపేట చెల్లూరు ఇండస్ట్రీ ఫీడర్, జొన్నాడలో కొంతభాగానికి కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

విజయనగరం ఫోర్ట్: నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం గంటల నుంచి ఒంటిగంట వరకు దాసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణానగర్, టౌన్ సెంటర్ లేఅవుట్, శ్రీనివాసనగర్, భగవాన్ నగర్, వినాయకనగర్, కృష్ణారాజపురం, స్వామి లేఅవుట్‌లకు..అలాగే ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఇప్పిలి వీధి, బుంగ వీధి, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఏరియా, కోలగట్ల వారి వీధి, కొనిసి వీధి, అద్దెపల్లి వీధిలకు..ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మంగళవీధి కాలనీ, ప్రేమసమాజం ఏరియా, విజయలక్ష్మినగర్, కొత్తపేట గొల్లవీధి, కుమ్మర వీధిలకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

భోగాపురం: మండలంలోని సవరవిల్లి, ఉప్పాడపేట, రావాడ, బసవపాలెం, తూడెం, కవలవాడ, గుడివాడ, ఇరుసుపేట, మద్దిపేటలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ జి.సురేష్ బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ తీగలు తాకే చెట్లకొమ్మలు తొలగించే పనుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం టౌన్: తాపీమేస్త్రీ శిక్షణ నెల రోజుల పాటు ఇవ్వనున్నామని, త్వరలో ప్రారంభమయ్యే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ పీఎంఏవైజీ పథకం కింద జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని తాపీ పనులు చేసే 18 నుంచి 45 ఏళ్ల వయసు మధ్య పురుషులకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐలో ఇచ్చే ఈ శిక్షణ గూర్చి పూర్తి సమాచారం కోసం బీసీ కాలనీ, మహిళా ప్రాంగణానికి వెళ్లాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9959521662ను సంప్రదించాలన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకం విడుదల చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు

విజయనగరం గంటస్తంభం: స్థానిక ఎల్బీజీ భవనంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ముద్రించిన విజయనగరం సమగ్రాభివృద్ధి అవసరాలు–అవకాశాలు అనే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘ జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఏప్రిల్ ఐదో తేదీన జరిగిన సెమినార్‌లో జిల్లా అభివృద్ధికి, ఉపాధి కల్పనకు చేపట్టాల్సిన చర్యలను చర్చించడం జరిగిందని, అందులోని అంశాల ఆధారంగా ఈ పుస్తకం రూపొందించడం జరిగిందన్నారు.



మట్టి గణపతినే పూజిద్దాం

మట్టి గణపతినే పూజిద్దామని పిలుపునిస్తూ విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్‌లు మట్టి వినాయక విగ్రహాలు గురువారం పంపిణీ చేశారు. గంటస్తంభం వద్ద ఆమె..ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆయన 500 విగ్రహాలు చొప్పున మొత్తం వెయ్యి ప్రతిమలు నగరవాసులకు అందజేశారు. ఈ నెల 27న గణేశుని ఉత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ పూజలకు మట్టి గణపయ్యలనే వినియోగించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని వారు కోరారు.(–విజయనగరం



అంగన్‌వాడీల నిరసన

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విజయనగరంలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తోటపాలెం సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఆన్‌లైన్ వర్కులు, యాప్‌ల వల్ల పనిభారం పెరిగిపోయి అంగన్‌వాడీ కేంద్రాల్లో తాము చేపట్టాల్సిన పౌష్టికాహారం పంపిణీ, ప్రీస్కూల్ నిర్వహణ వంటి కీలక విధులకు ఆటంకం కలుగుతోందన్నారు. ఆన్‌లైన్ వర్కుల నుంచి మినహాయింపు కలిగించి, 5జీ నెట్‌వర్క్‌తో డేటా సదుపాయం కల్పించి ఒకే యాప్ కిందికి అన్ని సేవలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పైడిరాజు, నాయకులు సునీత, ప్రభావతి, చిట్టితల్లి తదితరులు పాల్గొన్నారు. –విజయనగరం ఫోర్ట్

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి



దివ్యాంగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ అప్పలనాయుడు

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం: రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు రద్దయిన దివ్యాంగులతో గురువారం సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 216 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల పింఛన్లు రద్దు చేయడంతో అందరిలో ఆందోళన నెలకొందన్నారు. తాజాగా మరికొంతమందికి సదరం చేసుకోవాలని అధికారులు నోటీసులు కూడా పంపిస్తున్నారన్నారు. దీంతో వారంతా సదరం కోసం ఇబ్బందులు పడుతూ నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రద్దయిన పింఛనుదారుల్లో అర్హులుంటే ఈ నెల 25వ తేదీలోగా సచివాలయాల్లో పింఛన్ల పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారని, వారికి న్యాయం జరగని పక్షంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులకు న్యాయం జరిగేంత వరకు వారి తరఫున పోరాడి వారికి అండగా నిలుస్తామన్నారు. ఆయన వెంట బడుకొండపేట సర్పంచ్ సారిక సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

లక్ష్య సాధన వైపు అడుగులు వేయండి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీతం కళాశాల కరస్పాండెంట్ ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: విద్యార్థులంతా జీవితంలో బాగా స్థిరపడేందుకు లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధన వైపు అడుగులు వేయాలని సీతం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి సూచించారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఇంజినీరింగ్ మొదటి ఏడాది తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై ప్రసంగించారు. ఏ ఒక్కరూ సమయాన్ని వృథా చేయకుండా చక్కగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనడం చేయాలని తర్వాత స్మార్ట్ లెర్నింగ్, భావోద్వేగ మేధస్సు, బలమైన కమ్యునికేషన్ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. మెరుగైన ప్లేస్‌మెంట్‌ల కోసం అన్ని సబ్జెక్టులలో ప్రతిభ కనబరచాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీఏ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.